ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
బుధవారం 16 జూలై 2025

'స్వశక్తి'కి ప్రోత్సాహం



విడుదలైన వడ్డీ రాయితీ		
మండలం	సంఘాలు	వచ్చిన రాయితీ (లక్షలలో)
బోయినపల్లి	696	98.90
ఇల్లంతకుంట	951	145.51
వేములవాడ అర్బన్	365	46.84
వేములవాడ రూరల్	442	58.81
చందుర్తి	613	82.50
రుద్రంగి	325	41.61
కోనరావుపేట	910	113.32
తంగళ్లపల్లి	926	124.40
గంభీరావుపేట	1004	141.34
ముస్తాబాద్	1018	138.68
వీర్నపల్లి	280	34.76
ఎల్లారెడ్డిపేట	4250	150.85
మొత్తం	8,552	1,177.519

మండలాల వారీగా రావాల్సిన వడ్డీ రాయితీ బకాయిలు (లక్షల్లో)					
మండలం	2020- 21	2021-22	2022 -23	సంఘాలు	మొత్తం
బోయినపల్లి	178.99	209.51	177.39	792	575.89
చందుర్తి	131.73	185.57	161.73	712	479.03
ఇల్లంతకుంట	253.56	316.83	278.97	1145	849.36
గంభీరావుపేట	230.93	288.59	285.13	1191	804.65
కోనరావుపేట	152.69	229.63	178.60	1038	560.92
ముస్తాబాద్	276.82	301.01	247.12	1124	824.95
రుద్రంగి	58.91	66.92	68.40	368	194.23
తంగళ్లపల్లి	263.75	300.97	246.70	1145	811.42
వీర్నపల్లి	53.94	72.39	66.55	303	192.88
వేములవాడ	65.09	100.84	86.04	361	251.97
వేములవాడ రూరల్	113.13	130.24	118.75	544	362.12
ఎల్లారెడ్డిపేట	277.73	375.63	305.80	1037	959.16
మొత్తం	2,067.27	2,578.13	2,221.18	9,755	6,866.58

- మహిళా సంఘాలకు ఆరు నెలల వడ్డీ రాయితీ రూ. 11.77 కోట్లు విడుదల
- సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో రాయితీ రూ 4.64 కోట్లు
- పాత బకాయిలకు తప్పని ఎదురు చూపులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామన్న కొత్త ప్రభుత్వం వివిధ పథకాలతో స్వశక్తిసంఘాల మహిళల ఆర్థికాభివృద్ధిపై దృష్టి పెట్టింది. వడ్డీ రాయితీని విడుతల వారీగా విడుదల చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలోని పేరుకుపోయిన బకాలు చెల్లించకుండా కొత్తబకాయిల చెల్లింపుపైనే ప్రభుత్వం దృష్టి సారించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే డిసెంబర్-2023 నుంచి 2024మార్చి వరకుఉన్న బకాయిల్లో రాజన్నసిరిసిల్ల జిల్లా స్వశక్తి సంఘాలకు రూ.7.39 కోట్లు విడుదల చేసింది. మళ్లీ మహిళా శక్తి పథకం కింద 2024-25 సంవత్సరానికి సంబంధించిన గత సంవత్సరం ఏప్రిల్‌నుంచి సెప్టెంబర్ వరకు ఆరునెలల బకాయిలు 8,552సంఘాలకు రూ.11.77కోట్లు విడుదలయ్యాయి. మున్సిపాలిటీలు సంబంధించి 1,182సంఘాలు రూ. 2.13కోట్లు మంజూరు చేశారు. ఎన్‌యుఎల్‌ఎం కింద 1,088 సంఘాలకు రూ 2.51 కోట్లు మంజూరు ఇచ్చారు. ఇందులో సిరిసిల్ల మున్సిపాలిటీలో 810సంఘాలకు రూ.1.13కోట్లు, వేములవాడలో 372సంఘాలకు రూ. 42.47లక్షలు స్వశక్తి సంఘాలకు వడ్డీ రాయితీ విడుదల చేశారు.

● మహిళా సంఘాలకు యూనిట్లు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహిళాశక్తి పథకం ద్వారా డెయిరీయూనిట్లు, అయిల్‌మిల్, పెరటికోళ్ల పెంపకం, ఆర్టీసీ బస్సులు, కుట్టుమిషన్ కేంద్రం, బేకరీలు, గిఫ్ట్ ఆర్టికల్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మొబైల్ టిఫిన్‌సెంటర్‌లు, రిటైల్ ఫిష్ అవుట్‌లెట్‌లు, చట్నీస్, స్నాక్స్‌వంటి యూనిట్లు ప్రారంభించుకున్నారు. తాజాగా విడుదలైన వడ్డీమాఫీ డబ్బులు 8,552సంఘాలకు రూ.11.77కోట్లు సంఘాల ఖాతాల్లో జమ చేస్తున్నారు. స్వశక్తి సంఘాలద్వారా 2012సంవత్సరంలో పావలావడ్డీ రుణాలను అందించడం అప్పటి ప్రభుత్వం మొదలు పెట్టింది. తర్వాత వడ్డీలేని రుణాలగా మార్చింది. ఇప్పటి వరకు జిల్లాలో 9,070సంఘాలు రూ.61.02కోట్ల వడ్డీ రాయితీ పొందారు. 2014-2015లో 7048సంఘాలకు రూ. 5.83కోట్లు, 2015-2016లో 7,181 సంఘాలకు 4.95కోట్లు, 2016-2017లో 7,547సంఘాలకు 7.33కోట్లు, 2017-2018లో 7,918సంఘాలకు 6.69కోట్లు, 2018-2020లో 9,070 సంఘాలకు

- మిగతా 8లో

లక్ష్యసాధన దిశగా చదవండి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
- పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు అందించి విద్యార్థులతో మాట్లాడుతున్న బండి సంజయ్

సిరిసిల్ల జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టుదల, ప్రణాళిక, క్రమశిక్షణతో లక్ష్య సాధన దిశగా చదివినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రధాని మోదీ గిఫ్ట్ పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా , ఎస్పీ మహేష్ బీ గీతేలతో కలిసి సైకిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థులతో ముచ్చటించారు ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. తాను పేద కుటుంబం నుండి వచ్చానని, సొంతంగా సైకిల్ కూడా ఉండేది కాదని అన్నారు. ఆ బాధ విద్యార్థులు పడకూడదనే ప్రభుత్వ స్కూళ్లలో చదివే పదో తరగతి విద్యార్థులందరికీ సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీగా ఉన్నంత కాలం ప్రతి ఏటా పదో తరగతి చదివే విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తానని ప్రకటించారు. ఇవి బతుకమ్మ చీరలల్లెక్క క్వాలిటీ లేనివి కావు. ఇవి బ్రాండెడ్ సైకిళ్లని అన్నారు. ఎల్‌కేజీ నుంచి ఆరో తరగతి చదివే విద్యార్థులందరికీ మోదీ కిట్ పేరుతో బ్యాగు, వాటర్ బాటిల్, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేస్తామని అన్నారు. ఇది ప్రభుత్వ స్కీం కాదు. నా దగ్గరకు వచ్చే సంస్థల సహకారంతో సీఎస్సార్ నిధులను సేకరించి సైకిళ్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడున్న కలెక్టర్ ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చారు. బాగా చదువుకుని ఈ స్థాయికి వచ్చారని, కొన్ని విషయాల్లో కఠినంగా ఉంటారని అన్నారు. ప్రజలకు మంచి చేస్తున్నారని అన్నారు. మహారాష్ట్రలోని వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన జిల్లా ఎస్పీ మహేశ్ ఏ కోచింగ్ తీసుకోకుండా కష్టపడి చదువుకుని ఐపీఎస్‌కు ఎంపికయ్యారని వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నేతన్నల పుట్టిల్లు సిరిసిల్ల. సైకిళ్లపై బట్టలు తీసుకెళ్లి గతంలో అమ్మేవాళ్లు. వారంతా ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని, ఆ కష్టాన్ని గుర్తు చేసుకుని బాగా చదువుకోవాలని అన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మొట్టమొదట ఇష్టమైనది సైకిల్. ఆ సైకిల్‌ను విద్యార్థులకు ఇస్తున్న బండి సంజయ్‌ను అభినందించకుండా ఉండలేమని అన్నారు.

● సైకిళ్ల పంపిణీతో విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం ఉంటుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా అన్నారు. ఎస్పీ మహేశ్ బీ గీతే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సైకిళ్లు ఇవ్వడం చాలా సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వేంకటేశ్వర్లు,జడ్పీ సీఈవో వినోద్, బీజేపీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి,పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడేపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ తొక్కుతున్న బండి సంజయ్ కుమార్

భూసమస్యలను పరిష్కరించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్ కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి లోకేష్‌కుమార్ మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాతో సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్‌కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యల పరిష్కారానికి వచ్చిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి భూభారతి చట్టం నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.ఫైల్ ప్రాసెస్ మొత్తం అన్‌లైన్ పద్ధతిలో ప్రొసీజర్ ప్రకారం మాత్రమే నిర్వహించాలని త్వరలో దరఖాస్తు పెండింగ్ ఎక్కడ ఉన్నది చెక్‌చేసుకునే అవకాశం ప్రజలకు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. హైకోర్టు నుంచి వచ్చే తీర్పు మేరకు సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారం చేయాల్సి ఉంటుందని ప్రస్తుతం వాటిని మినహాయించి మిగిలిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ డి సెక్షన్ అధికారి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిల్ అధ్వర్యంలో గ్రూప్స్ 1, 2, 3, 4తో పాటు ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ , ఫౌండేషన్ కోర్స్‌లకు ఉచితంగా 150 రోజుల పాటు కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని సిరిసిల్ల బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హులైన వారు ఆన్‌లైన్‌లో ఆగస్టు 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు డీగ్రీలో అత్యధిక మార్కులు పొంది ఉండాలని అలాగే వార్షిక అదాయం అనుగుణంగా ఉన్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి ఐదునెలల పాటు రూ. వెయ్యి స్టైయిఫండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం ఫోన్ నెం. 08723-223004, 9381888746లలో సంప్రదించాలని వెంకటస్వామి కోరారు.

మద్యానికి బానిసలు కావద్దు

సిరిసిల్ల రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మరమగ్గాల కార్మికులు మద్యానికి బానిసలు కావద్దని పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌లో మంగళవారం మరమగ్గాల కార్మికులకు మైండ్‌కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ అధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి కార్మికులకు వైద్యపరీక్షలు, మందులు పంపిణీ చేశారు. అనంతరం కార్మికులకు మద్యపాన వ్యసనంపై అవగాహన కల్పించారు. సైకాలజిస్ట్ పున్నంచందర్ మాట్లాడుతూ అతిగా మద్యపాన వ్యసనానికి లోనైన వ్యక్తిలో పారానాయుడిజం అనే అనుమాన ప్రవృత్తి పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వస్త్ర ఉత్పత్తిదారుడు బూట్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను శాశ్వతంగా నివారించడమే లక్ష్యం : చిక్కాల

గంభీరావుపేట, జులై 15 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో విద్యుత్ సమస్యను శాశ్వతంగా నివారించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సిరిసిల్ల సెస్ చైర్మెన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. గంభీరావుపేట సెస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాత టాన్స్‌ఫార్మర్లు, లూస్‌లైన్లు, మిడిల్ పోల్స్ తదితర మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపడుతున్నట్టు తెలిపారు. సెస్ సంస్థకు వినియోగదారులు రూ: 172 కోట్లు పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. మల్లారెడ్డిపేట, కోళ్ళమద్ది, సముద్రలింగాపూర్ గ్రామాల్లో నూతన సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో సెస్‌డైరెక్టర్ నారాయణరావు, ఏఈ అనంద్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల బిల్లులు ఇవ్వాలి

వీర్నపల్లి, జూలై15,(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రం అంబేద్కర్ నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చివరి దశకు చేరుకున్నా ప్రభుత్వం నుంచి సాయం అందలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. రోడ్డు కోసం సహకరిస్తే గత ప్రభుత్వం చేసిన మోసానికి ఈ ప్రభుత్వమైనా పట్టించుకొని బిల్లులు ఇప్పించాలని మంగళవారం నిరసన చేపట్టారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టితో బిల్లులు ఇప్పించాలని వేడుకున్నారు. రమేశ్, ఇషాక్, సంజీవ్, ఆనందం, కాంతయ్య, బాబు, రాములు, దేవయ్య పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

సిరిసిల్ల టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : టీఎస్ఆర్టీసీ సిరిసిల్ల డిపోలో ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. మంగళవారం సిరిసిల్ల డిపో ఆవరణలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉత్తమ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఇంధన పొదుపులో ప్రతిభను కనబరిచిన డ్రైవర్లు ఎం నరసయ్య, బీ నర్సింగ్‌లను డిపో మేనేజర్ ఏ ప్రకాష్‌రావు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సేవలను అందిస్తూ అవార్డులను అందుకుంటున్న డ్రైవర్లను ఇతర డ్రైవర్లు, సిబ్బంది ఆదర్శంగా తీసుకోవాలని డీజిల్ ఆదా చేసి డిపో అభివృద్ధికి పాటుపడాలన్నారు. డిపో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ఇల్లంతకుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సబ్‌యూనిట్ అధికారి భూక్య మోహన్ పేర్కొన్నారు. మండలంలోని గాలిపెల్లి, ఇల్లంతకుంట గ్రామాలలోని బీసీ, ఎస్సీ , గురుకుల, కస్తూర్బా , ఆదర్శ పాఠశాలల వసతి గృహాలలో మంగళవారం క్రిమికీటక నివారణ మందు పిచికారి చేశారు. పరిసరాలలో నీరు నిల్వఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ వెంకటరమణప్రసాద్, సూపర్‌వైజర్ జవహర్‌లతో వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్వార్టర్ పెచ్చులూడి కార్మికుడికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి క్వార్టర్ పైకప్పు పెచ్చులూడి పడి కార్మికుడు గాయపడిన ఘటన పోతనకాలనీలో మంగళవారం జరిగింది. పోతనకాలనీ 65వ బ్లాక్ 908 క్వార్టర్‌లో నివసిస్తున్న ఓవర్‌మెన్ రాకేష్ మధ్యాహ్నం బెడ్‌రూంలో నిద్రిస్తున్న సమయంలో సీలింగ్ పై పెచ్చులు ఊడి మీదపడడంతో నడుము, పక్కటెముకలకు గాయాలయ్యాయి. హుటాహుటిన సెక్టార్-3 డిస్పెన్సరీకి రాకేష్‌ను కుటుంబసభ్యులు తరలించారు. సీఐటీయూ ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్ క్వార్టర్‌ను పరిశీలించి నాసిరకం పనులతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

సీసీ ఫుటేజీల సేకరణ


కరీంనగర్ క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆత్మహత్య చేసుకున్న శ్రావణ్‌కుమార్ కేసులో విచారణ అధికారులు కరీంనగర్ మహిళా ఠాణాలోని సీఐ చాంబర్‌లో, బయట, ఆర్టీసీ బస్టాండ్ వద్ద పలుచోట్ల సీసీ కెమెరాల ఫుటేజీలను మంగళవారం సేకరించారు. అనంతరం వాటిని క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిసింది. శ్రావణ్‌కుమార్, నీలిమకు కౌన్సెలింగ్‌తోపాటు మినట్ టు మినట్ ఫుటేజీల్లోని వీడియోలను పరిశీలించి భద్రపరిచి నట్లు సమాచారం. నివేదికను ఐజీకి పంపించనున్నారు. నివేదిక ఆధారంగా ఐజీ చర్యలు తీసుకునే అవకాశముంది.

విద్యార్థులకు అపార్



- విద్యా సమాచారం అంతా భద్రం
- విద్యార్థులకు డిజిటల్ వ్యాలెట్
- వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ

చొప్పదండి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి ఆధార్‌కార్డు ఒక గుర్తింపునిచ్చింది. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధార్‌కార్డు తరహాలోనే ప్రతి విద్యార్థికి అపార్ కార్డును తీసుకువచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2020 నూతన విద్యావిధానంలో భాగంగా డీపీఐఈ (డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో ఈ అపార్ కార్డులను రూపొందించారు. ఈ కార్డు ద్వారా విద్యార్థుల విద్యా సమాచారం ఒకేచోట భద్రంగా ఉండే విధంగా రూపొందించారు. వన్‌నేషన్.. వన్ స్టూడెంట్ ఐడీ ప్రక్రియ యాప్‌లో భాగంగా అపార్‌కార్డు అమలవుతోంది.



విద్యార్థుల కోసం డిజిటల్ ఐడీ కార్డు...

ఆధార్ కార్డు మాదిరిగా విద్యార్థుల కోసం డిజిటల్ ఐడీ కార్డు(అపార్)ను అందజేస్తున్నారు. అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) దేశంలో నూతన విద్యా విధానంలో భాగంగా విద్యార్థుల కోసం డీపీఐఈ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అపార్ కార్డు కోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రత్యేక అనుమతి పొందాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ కార్డును పొందవచ్చు.

ఉపయోగాలు...

ప్రతి విద్యార్థికి 12 అంకెలతో ప్రత్యేక ఐడీ ఉంటుంది. ఇది ఎడ్యు లాకర్ అనే డిజిటల్ వ్యాలెట్‌లో నిల్వ ఉంటుంది. విద్యార్థులు చదివిన స్కూల్, గ్రేడ్‌లు, పరీక్ష ఫలితాలు, కోర్సులు ఈ కార్డులో నమోదవుతాయి. విద్యార్థి స్కూల్, కళాశాల మారిన కూడా తన తోనే ఉంటుంది. కార్డు ఉచితంగా లభిస్తుండగా దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి లభిస్తుంది.

అపార్ కార్డును విద్యార్థుల ఆధార్ కార్డుతో అనుసంధానం చేస్తారు. ఈ కార్డు నేషనల్ అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్(ఏబీసీ)లో భాగంగా పని చేస్తుంది. స్కాలర్ షిప్‌లు, పోటీ పరీక్షలకు దరఖాస్తు చేయడంలో ఈ కార్డు ఉపయోగపడుతుంది. ఉద్యోగాల కోసం ఉపయోగపడే డిజిటల్ వ్యాలెట్‌గా ఈ కార్డు పనిచేస్తుంది.

అపార్ కార్డు పొందడం ఎలా...

విద్యార్థులు నేరుగా అపార్‌కార్డును పొందరాదు. స్కూల్ అడ్మిన్ లేదా విద్యాశాఖను సంప్రదించాలి. స్కూల్ రిజిస్ట్రేషన్ స్టేటస్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేయాలి. పేరెంటల్ కాన్సెంట్ ఫారాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలి. విద్యార్థుల వివరాలను నమోదు చేసిన తర్వాత అపార్ కార్డును డిజి లాకర్ లేదా ఏబీసీ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. కార్డు తప్పనిసరిగా తీసుకోవాలన్న నిబంధన లేకపోయినా ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

దొంగతనం కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో కొండ రంజిత్ అనే వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధిస్తూ మంగళవారం సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు ఇచ్చారు. సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన ఆడెపు రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా పనిచేస్తుంటాడు. ఇతను పిల్లలను చూసేందుకు మే 25, 2023న అమెరికా వెళ్లాడు. ఇల్లు ఖాళీగా ఉండకూడదని కొండ రంజిత్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. మూడు నెలల తర్వాత అమెరికా నుంచి సిరిసిల్లకు వచ్చి ఇంట్లో చూస్తే సోనీ టీవీ, గ్యాస్ సిలిండర్, మోటార్ దొంగతనం చేశారు. ఈ దొంగతనంపై ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదుచేసి కొండ రంజిత్‌ను రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు కానిస్టేబుల్ నరేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ సందీప్ వాదనలు వినిపించారు. న్యాయమూర్తి నిందితుడు రంజిత్‌కు ఏడాది జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధించారు.

భార్యను వేధించిన భర్తకు మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం/తంగళ్లపల్లి జూలై 15(ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన కేసులో తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి గ్రామానికి చెదిన కంది రమేశ్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సిరిసిల్ల రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గడ్డం మేఘన మంగళవారం తీర్పు వెలువడించారు. తంగళ్లపల్లి ఎస్‌ఐ ఉపేంద్రచారి వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన కంది పద్మకు బద్దెనపల్లి గ్రామానికి చెందిన కంది రమేశ్‌తో 2001లో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. మద్యానికి బానిసైన రమేశ్ భార్య పద్మను, పిల్లలను నిత్యం వేధించేవాడు. ఈ క్రమంలో జూలై 4, 2017న మద్యం మత్తులో రమేశ్ తన భార్యను డబ్బులు ఇవ్వాలంటూ వేధించడమే కాకుండా తీవ్రంగా కొట్టాడు. అడ్డువచ్చి న అత్తపై సైతం దాడిచేశాడు. ఈ మేరకు భర్త రమేశ్‌పై భార్య పద్మ ఫిర్యా దు చేయగా అప్పటి ఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాడు. ఈ కేసులో పీపీ పెద్ది విక్రాంత్ వాదనలు వినిపిం చగా కోర్టు కానిస్టేబుల్ శ్రీకాంత్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పూర్వాపరాలను పరిశీలించిన జూనియర్ సివిల్ జడ్జి మేఘన నిందితుడు రమేశ్‌కు మూడేళ్ల కఠిన శిక్ష విధించారు.

కరీంనగర్‌లో రెండు చోట్ల ఏసీబీ సోదాలు

కరీంనగర్ క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయం కరీంనగర్‌లోని సవరన్‌స్ట్రీట్, రాంనగర్ ప్రాంతాల్లో రెండు ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో డాక్యుమెంట్లు, నగదు లభ్యం కాలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు రిటైర్డ్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) మురళీధర్‌రావుపై హైదరాబాద్‌లో ఏసీబీ అధికారులు ఆదాయానికి మించి ఆస్తుల కేసును నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి కరీంనగర్‌లో మురళీధర్‌రావు సోదరుడు డాక్టర్ రాంమోహన్‌రావు, మరో సమీప బంధువు రవీందర్‌రావు ఇళ్లలో సోదాలు జరిపారు. డాక్టర్ రాంమోహన్‌రావు స్థానికంగా లేనట్లు, విదేశాల్లో ఉంటున్నట్లు తెలిసింది. రాంనగర్‌లోని రవీందర్‌రావు ఇంటికి వెళ్లిన ఏసీబీ పోలీసు అధికారులు మురళీధర్‌రావు వద్ద లభ్యమైన ఒక డాక్యుమెంట్‌కు సంబంధించిన కొన్ని అనుమానాలను నివృత్తి చేసుకున్నట్లు సమాచారం. హైదరాబాద్ ఏసీబీ ఆదేశాలతో కరీంనగర్‌లో రెండు చోట్ల సోదాలు చేశామని, దాడుల్లో ఏమీ లభించలేదని ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు.

11 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న 11 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు, యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ మంగళవారం నిరంజన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ శివారులో ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకొని సుల్తానాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన ట్రాక్టర్ ఓనర్ కం డ్రైవర్లు కొత్తూరి రమేష్, కొత్తూరి వంశీ, దర్శనా ల మహేష్, దర్శనాల రాజు, బేతి సునీల్‌రెడ్డి, ఏలవేని రమేష్‌బాబు, చేగు ర్తి, లింగాపూర్ శివారు నుంచి ఇసుకను తరలిస్తున్న మరో ఐదు ట్రాక్టర్లు పట్టుకొని దుర్గం చంద్రమోహన్, ఎల్కపల్లి నవీన్, పోతర్ల క్రాంతికుమార్, కుర్ర రాజేశంపై కేసులు నమోదు చేశామన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్


లింగయ్యకు బ్యాగును అప్పగిస్తున్న ఆటో డ్రైవర్ రవి, పోలీసులు

కోల్‌సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ ఏరియా నుంచి గోదావరిఖని బస్టాండ్‌కు మంగళవారం ఆటోలో ప్రయాణించిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి సుధమల్ల లింగయ్య ఆటోలో బ్యాగు మరిచిపోయాడు. ఆటో డ్రైవర్ జాగిలపు రవి బ్యాగును గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. బ్యాగులో సెల్‌ఫోన్, పర్సు ఇతర డాక్యుమెంట్లు ఉన్నాయి. పోలీసులు లింగయ్యను పిలిపించి బ్యాగు అప్పగించారు. ఆటోడ్రైవర్ రవిని వన్‌టౌన్ ఎస్‌ఐ భూమేష్, యూనియన్ నాయకుడు కె నారాయణ అభినందించారు.

చిన్నారిని బెదిరించిన గుర్తుతెలియని వ్యక్తి

తిమ్మాపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల చిన్నారిని గుర్తుతెలియని వ్యక్తి బెదిరించిన ఘటన మండలంలోని రేణికుంట గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో ఏడేళ్ల బాలిక ఆడుకుంటూ దగ్గరలో ఉండే ఓ రైస్ మిల్ సమీపంలోకి వెళ్లింది. ఓ వ్యక్తి బాలికను బలవంతంగా పక్కనే ఉన్న ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లాడు. బాలిక కేకలు వేయడంతో అటువైపుగా వెళుతున్న బాలిక తల్లిని చూసి సదరు వ్యక్తి పారిపోయాడు. రైస్‌మిల్లులో పనిచేసే వ్యక్తే బాలికను బెదిరించినట్టు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ బాధిత బాలికను వారి తల్లిదండ్రు లను ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. ఈ విషయంపై ఎస్సై శ్రీకాంత్ గౌడ్‌ను వివరాలు కోరగా స్థానికంగా ఉండే ఓ గుర్తుతెలియ ని వ్యక్తి డబ్బుల కోసం బాలికను కత్తితో బెదిరించాడని, ఎలాంటి బ్యాడ్ టచ్ చేయలేదని బాలిక చెప్పిందని ఎస్సై తెలిపారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకుంటామని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

ప్రాణాలు తీసిన పంచాయితీ

- పరస్పర దాడుల్లో ఇద్దరి మృతి
- మరో నలుగురికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్, జూలై 15: (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య పంచాయితీ ఇద్దరి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మంగళవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లి వద్ద జరిగింది. బాధితులు, పోలీసు అధికారుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఓదెల మండలం తారకరామనగర్‌కు చెందిన మోటం సారయ్యకు ఐదుగురు కుమారులు. వీరు సీజనల్ వ్యాపారాలు చేస్తూ సంచార జీవనం సాగిస్తున్నారు. సారయ్య కుమారుడు మోటం మారయ్యకు పెద్దపల్లి పట్టణానికి చెందిన లక్ష్మితో ఇరవై సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. వీరి మధ్య ఆరు నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో లక్ష్మి పుట్టింటికి వెళ్లింది. పలుమార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు, పెద్ద మనుషుల మధ్య పంచాయితీలు జరిగినా వారి మధ్య వివాదం సద్దుమణగలేదు. ఈ క్రమంలో మంగళవారం సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లి పెట్రోల్‌బంక్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పంచాయితీ ఏర్పాటుచేశారు. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో మారయ్య తరఫు కుటుంబసభ్యులు ఇతర పెద్ద మనుషులు వచ్చారు. అలాగే లక్ష్మి తరఫు నుంచి కూడా వచ్చారు. ఇరువర్గాలకు సంబంధించి మొత్తం ముప్పై మంది హాజరయ్యారు. పెద్ద మనుషులు మాట్లాడుతున్న సమయంలో అమ్మాయి తరఫు నుంచి వాహనంలో వచ్చిన కొందరు వెంట తెచ్చుకున్న కత్తులు, గొడ్డళ్లు, కర్రలతో సారయ్యతో పాటు వారి ఐదుగురు కొడుకులపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరువర్గాల వారు దాడులకు దిగారు. ఇందులో మారయ్యతో పాటు అతని తమ్ముళ్లు మల్లేశం, మధనయ్య, రమేష్ అనిల్, అజయ్ జంపయ్యకు గాయాలయ్యాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మోటం మల్లేశం, మధునయ్యతో పాటు గాయపడిన వారిని బంధువులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో తీవ్రంగా గాయపడ్డ మోటం మల్లేశం (35) చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మల్లేశం కొంతకాలంగా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో ఉంటూ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. భార్య రజిత ఇద్దరు పిల్లలు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన మధునయ్య, సారయ్య తదితరులను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రతీదాడిలో లక్ష్మి తరఫు వారికి చెందిన పెద్దపల్లి మండలం రాఘవపూర్ చెందిన గాండ్ల గణేష్ (32) పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.


సొమ్మసిల్లిన మృతుడు మల్లేషం భార్య రజిత


మోటం మల్లేషం, గాండ్ల గణేష్(ఫైల్)

● పథకం ప్రకారం దాడులు

పక్కా పథకం ప్రకారం తమను పంచాయితీకి పిలిచి తమపై దాడులు చేశారని, తమను చంపడానికి ప్రయత్నం చేశారని మోటం మల్లేశం సోదరుడు మారయ్య తదితరులు తెలిపారు. వెంట తెచ్చుకున్న మారణాయుధాలతో దాడి చేయగా మోటం మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందగా తండ్రి సారయ్య, మరో ముగ్గురు సోదరులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులు బంధువులతో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి శోకసంద్రంగా మారింది. మృతుడు మోటం మల్లేశం భార్య రజిత సొమ్మసిల్లి పడిపోయింది.

● కేసు విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

భార్యాభర్తల మధ్య సుగ్లాంపల్లి వద్ద ఇరువర్గాల వారు నిర్వహించుకున్న పంచాయితీలో ఇరువర్గాల దాడిలో ఇద్దరు మృతి చెందినట్లు పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ తెలిపారు. సుల్తానాబాద్ ఆసుపత్రికి చేరుకున్న డీసీపీ దాడుల ఘటన వివరాలను బాధితులను, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇరువర్గాల దాడుల్లో మోటం మల్లేశం, పెద్దపల్లి మండలం రాఘవపూర్‌కు చెందిన గాండ్ల గణేష్ మృతి చెందారని తెలిపారు. విచారణ జరిపి దోషులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పెద్దపల్లి ఏసీపీ జి క్రిష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తదతరులు ఉన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

కొడిమ్యాల, జూలై 15(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న మొట్టె రమేష్ అనే వ్యక్తిని కొడిమ్యాల మండలం అప్పారావుపేట గ్రామ సమీపంలో మంగళవారం పట్టుకున్నట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ తెలిపారు. పూడూర్ గ్రామానికి చెందిన రమేష్ గంజాయి అమ్ముతున్నాడన్న సమాచారంతో తనిఖీ చేసి అతడి వద్ద 125 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయిని మహారాష్ట్రలోని నాగ్‌పూర్ పట్టణంలోని గుర్తుతెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు నిందితుడు తెలిపాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాచర్లగొల్లపల్లిలో చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామంలో బైరి నరేశ్‌కు చెందిన కిరాణ కొట్టుతో పాటు వేణుగోపాలస్వామి ఆలయం సామగ్రి నిల్వ గదిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని పోలీసులు మంగళవారం తెలిపారు. నరేశ్ కిరాణ కొట్టులోకి ప్రవేశించిన దొంగలు మూడు వేల రూపాయల నగదు, పక్కనే ఉన్న ఆలయ గది నుంచి మూడు ఇత్తడి కలశాలను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పశువులను తరలిస్తున్న వారిపై కేసు

ధర్మారం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వారసంత నుంచి పశువులను తరలిస్తున్న వారిపై ధర్మారం పోలీసుల కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం మండల కేంద్రంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా టీఎస్ 02 యుబి 8787 అనే నంబర్‌గల వాహనంలో పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. అందులో నాలుగు ఎద్దులతో పాటు నాలుగు దూడలను తరలిస్తున్నారు. పోలీసులు విచారించగా కరీంనగర్‌కు చెందిన మొహమ్మద్ హుస్సేన్ ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లి వారసంతలో కొనుగోలు చేసి కరీంనగర్‌కు తరలిస్తున్నట్లు తేలింది. వాహన యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఇసుక టిప్పర్లు పట్టివేత

కోరుట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని పోలీసుస్టేషన్ తరలించినట్లు ఎస్‌ఐ చిరంజీవి మంగళవారం తెలిపారు. కథలాపూర్ మండలం బొమ్మెన నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తున్న రెండు టిప్పర్లను సోదా చేయగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఆర్ఐ అమర్ సమ్మద్ ఫిర్యాదు మేరకు డ్రైవర్, యజమానులు హజర్, దారంగుల వీరన్నపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి పేర్కొన్నారు.

మెడికల్ షాప్ యజమాని అరెస్ట్

- ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

సిరిసిల్ల క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఓ బాలికకు గర్భస్రావం కావడానికి మందులు విక్రయించిన సిరిసిల్ల పట్టణంలోని ఓ మెడికల్ షాప్ యజమాని నల్లా శంకర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి మంగళవారం తెలి పారు. ఆమె వివరాల ప్రకారం... ఓ బాలికను సిరిసిల్లకు చెందిన ఓ యువకుడు ప్రేమ పెళ్లి పేరుతో శారీరకంగా లోబరుచుకోగా ఆ బాలిక గర్భం దాల్చింది.

గర్భం పోవడానికి ఆ యువకుడు మెడికల్ షాప్ యజమాని నల్లా శంకర్‌ను ఆశ్రయించగా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వడంతో బాలికకు గర్భస్రావమైంది. ఈ విషయమై కేసు నమోదు చేసి ఆ యువకుడిని మే 30న అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత చట్ట వ్యతిరేకంగా బాలికకు మందులు ఇచ్చిన మెడికల్ షాప్ యజమానిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆమె తెలిపారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఎస్పీ హెచ్చరించారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధురాలి ఆత్మహత్య

హుజూరాబాద్‌రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముశం కొంరమ్మ(80) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. వృద్ధాప్య సమస్యలతో తన సొంత పనులు చేసుకునేందుకు కూడా ఇబ్బంది పడేది. దీంతో జీవితంపై విరక్తి చెంది యాసిడ్ తాగింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు..

కోరుట్ల (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన అరిసే గంగనర్సయ్య (59) అనే వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి మంగళవారం తెలిపారు గంగనర్సయ్యకు సంవత్సరం క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం కాగా తరచుగా మతిమరుపు వస్తోంది. దీంతో గంగనర్సయ్య మనస్థాపంతో సోమవారం రాత్రి గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. గంగనర్సయ్య కుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నాడు.

కొడుకు పనికి వెళ్లడం లేదని తండ్రి..

ముత్తారం: మండలంలోని ఖైదంబండ గ్రామానికి చెందిన బియ్యాని రవీందర్(40) అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. రవీందర్ కొడుకు కూలీకి వెళ్లాలని చెప్పినా వినకుండా గ్రామంలో తిరుగుతూ గొడవలకు పాల్పడుతున్నాడు. సోమవారం తండ్రి మందలించగా మాటామాటా పెరిగి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన రవీందర్ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం కరీంనగర్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడు రవీందర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

మెట్‌పల్లిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని ఆరపేట గ్రామ శివారులో మిషన్ భగీరథ పైపు లైను పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో బయ్యని నవీన్ కుమార్(28) అనే కూలీ సోమవారం మృతి చెందినట్లు మెట్‌పల్లి ఎస్‌ఐ కిరణ్ కుమార్ తెలిపారు. మిషన్ భగీరథ పైపు లైను పనుల కాంట్రాక్టర్ ఓర్సు ఏడుకొండలు వద్ద కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సర్దల్‌పూర్ గ్రామానికి చెందిన నవీన్ కుమార్ వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ కరెంట్ స్విచ్ బోర్డుపై పడటంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన స్థానికులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

జగిత్యాల క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి నాలుగు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 9,500 రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన కుంచెపు వేణు(26) అనే వ్యక్తి 2019లో బాలికను ద్విచక్రవాహనంపై తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించుకు వెళ్లాడు. ఈ ఘటనలో బాధితురాలు అప్పటి కోరుట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు వేణుపై అప్పటి సీఐ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు హరీష్, రాజు, శ్రీధర్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి నాలుగు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

- అటవీశాఖ అనుమతులు లేక నిలిచిన పనులు
- వేములకుర్తి-కోజన్ కొత్తూరు గ్రామాల ప్రజల ఇక్కట్లు

ఇబ్రహీంపట్నం, జూలై15 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి-కోజన్‌కొత్తూరు గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న లింకు రోడ్డు పనులు అటవీశాఖ అనుమతులు లేక నిలిచిపోయాయి. వేములకుర్తి-కోజన్ కొత్తూరు గ్రామాల మధ్య డి-24 ఎస్సారెస్పీ కాలువను ఆనుకొని ఉన్న చిన్న రోడ్డును 2018లో అప్పటి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు 1.86 కోట్ల రూపాయల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో 5.5 కిలో మీటర్ల లింకు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.

అనంతరం నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక అటవీ శాఖ అధికారులు పనులు నిలిపి వేయించారు. అటవీశాఖ అనుమతులు లేకుండా రోడ్డు నిర్మాణం ఎలా చేపడతారని సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసి జరిమానా విధించారు. అప్పటి నుంచి ఎన్నిసార్లు విన్నవించుకున్నా అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే వేములకుర్తి గ్రామం నుంచి మండల కేంద్రమైన ఇబ్రహీంపట్నం వెళ్లడానికి ఎనిమిది కిలో మీటర్ల మేర దూర భారం తగ్గుతుంది.

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పనుల నిమిత్తం వెళ్లేవారు యామాపూర్, తిమ్మాపూర్, గోదూర్ గ్రామాల మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ఈ లింక్ రోడ్డు పూర్తయితే దూరం తగ్గుతుందని, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటి కైనా ప్రజాప్రతి నిధులు చొరవ తీసుకొని అటవీ శాఖ అనుమతులు ఇప్పించి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.


నిలిచిపోయిన వేములకుర్తి-కోజన్ కొత్తూరు రోడ్డు పనులు

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

ఆరె రమేష్, వేములకుర్తి



ప్రభుత్వాలు మారినా వేములకుర్తి-కోజన్ కొత్తూరు గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం పూర్తి కావడం లేదు. అటవీ శాఖ అధికారులు అనుమతులు లేవని నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపి వేయించారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి రవాణా సౌకర్యం మెరుగవుతుంది.

ప్రజాప్రతినిధులు స్పందించాలి

దోనికెల నగేష్, వేములకుర్తి



రోడ్డు నిర్మాణం కోసం చాలా ఏళ్లుగా అధికారులకు, ప్రజాప్రతి నిధులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించడం లేదు. అటవీ అనుమతులు లేవని సంబంధిత అధికారులు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

పద్మారావు, ఎఫ్ఆర్‌వో, జగిత్యాల



రోడ్డు భవనాల శాఖ అధికారులు వేములకుర్తి-కోజన్ కొత్తూరు లింక్ రోడ్డుకు సంబంధించిన సర్వే నివేదిక పంపిస్తే అటవీ శాఖ అధికారులు ఉమ్మడి సర్వే చేస్తారు. అనంతరం మ్యాప్ రూపొందించి డీఎఫ్‌వో కార్యాలయానికి నివేదిక పంపిస్తాం.

ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు యూరియా ఇవ్వండి


ఎరువుల శాఖ కార్యదర్శి రాజత్ మిశ్రాకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ వంశీకృష్ణ

గోదావరిఖని, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగం యూరియా కొరతతో ఇబ్బందులు పడుతుందని, ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు యూరియా ఇవ్వాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంగళవారం కేంద్ర ఎరువులశాఖ కార్యదర్శి రాజత్ మిశ్రాను కోరారు. మంగళవారం ఢిల్లీలో రాజత్ మిశ్రాతో భేటీ అయిన వంశీకృష్ణ ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి ఎరువుల సరఫరా కుదించడంపై చర్చించారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి గత సంవత్సరంతో పోల్చితే 1.14లక్షల టన్నులు తక్కువ సరఫరా చేశారని, దానిని భర్తీ చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎరువుల శాఖ కార్యదర్శి తెలంగాణకు లోటును భర్తీ చేస్తామని, 2.7లక్షల టన్నులు సరఫరా చేస్తామని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల కర్మాగారం రామగుండంలో ఉన్నా ఇక్కడి రైతాంగానికి ఎరువులు దక్కకపోవడం అన్యాయమని కేంద్రానికి తెలిపామన్నారు. యూరియా కేటాయింపునకు సంబంధించి పాలసీలను మార్చాలని, పార్లమెంట్‌లో కూడా ఆందోళనకు వెనుకాడేది లేదన్నారు.

వేతనాలు చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన


ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

తంగళ్లపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశాన్ని ఉపాధి హామీ పీల్డ్ అసిస్టెంట్లు బహిష్కరించి నిరసన తెలిపారు. మంగళవారం తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యలయ అవరణలో ఉపాధిహామీ పీల్డ్ అసిస్టెంట్లతో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశాన్ని బహిష్కరించి ఎంపీడీవో లక్ష్మీనారాయణకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్ష కార్యదర్శులు కొమ్మట దేవయ్య, శేఖర్, శ్రీనివాస్, పూర్ణచందర్, రమేష్, కనకరాజు, అంతయ్య, ప్రభాకర్, ఆంజనేయులు, లావణ్య పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఆయిల్‌పామ్



- జిల్లాలో మూడేళ్లలో గెలలు వేసిన పంట
- పంటను కొనుగోలు చేసిన ఆయిల్‌పామ్ కంపెనీ
- సత్ఫలితాలు వచ్చాయంటున్న రైతులు
- జిల్లాలో 3,100 ఎకరాల్లో సాగు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పామ్ ఆయిల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకోకుండా దేశీయంగానే ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో రైతులకు రాయితీలు ఇస్తూ పంట సాగుకు చేస్తున్న ప్రోత్సాహం సత్ఫలితాలను ఇస్తోంది. పెద్దపల్లి జిల్లాలో ప్రయోగాత్మకంగా కొందరి రైతుల భూముల్లో సాగు చేసిన ఆయిల్‌పామ్ పంట చేతికి వచ్చింది. ఉద్యాన శాఖాధికారులు సూచించిన మేరకు దిగుబడులు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొదటిసారి ఆయిల్‌పామ్ పంట చేతికి వచ్చింది. టన్నుకు రూ.20 వేల పైచిలుకు ధరకు ఆయిల్ పామ్ గెలలను రైతులు విక్రయించారు. మూడేళ్లుగా ఉద్యాన, వ్యవసాయ శాఖాధికారులు రైతులను ప్రోత్సహిస్తుండడంతో సాగు విస్తీర్ణం 3,100 ఎకరాలకు చేరింది.

ఎకరానికి రూ.51 వేల సబ్సిడీ..

ఎలిగేడు మండలం రెబ్బల్‌దేవ్‌పల్లి వద్ద తిరు మల ఆయిల్ కేమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచింది. రైతులు పంట దిగుబడులను కూడా కంపెనీ కొనుగోలు చేసింది. కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లి గ్రామ శివారులో ప్రభుత్వం ఇచ్చిన భూమిలో ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని కూడా చేపట్టింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఆయిల్ పామ్ గెలలను శుద్ధి చేసి ఆయిల్‌గా మార్చి ఆయా ప్రాంతాలకు ఎగుమతి చేయనున్నారు. 2022-23లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేయిస్తున్నారు. ఎకరానికి చతురస్రాకారంలో 50 మొక్కలు, త్రిభుజాకారంలో 57 మొక్కలు నాటుతారు. ఒక్కో మొక్కకు రైతులు 20 రూపాయల చొప్పున డీడీ చెల్లిస్తే, ప్రభుత్వం 193 రూపాయల సబ్సిడీ ఇస్తుంది. అలాగే డ్రిప్ ఇరిగేషన్ కోసం ఎకరానికి 20 నుంచి 27 వేల వరకు సబ్సిడీ ఇస్తుంది. రెండు విడతల్లో పంట కలుపు, ఎరువులు, అంతర పంట కోసం


ఆయిల్ పామ్ తోటలో ఉద్యాన శాఖ అధికారులు

16,800 రూపాయలు ప్రభుత్వం రైతులకు అందజేస్తుందని అధికారులు తెలిపారు. మూడేళ్ల తర్వాత పంట కాపునకు వస్తుందని ఎకరానికి 8 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుందని అధికారులు తెలిపారు. ఏడాదికి లక్షా 50 వేల నుంచి 2 లక్షల ఆదాయం వస్తుందని, నిర్వహణ ఖర్చు 40 వేలు పోతే లక్షకు పైగా ఆదాయం వస్తుంది. పంట కాలం 30 నుంచి 35 ఏళ్ల వరకు ఉంటుంది.

ప్రయోగాత్మకంగా 11.23 ఎకరాల్లో సాగు

జిల్లాలో ప్రయోగాత్మకంగా ఆయిల్ పామ్ పంటను ఆరుగురు రైతులు 11.23 ఎకరాల్లో సాగు చేశారు. పంట కాపునకు వచ్చి గెలలు వేస్తున్నది. ఇప్పటి వరకు రెండుసార్లు పంట కోయగా, 18 టన్నుల 35 క్వింటాళ్ల 70 కిలోల దిగుబడి వచ్చింది. ఈ పంటను టన్నుకు 20,057 నుంచి 20,074 రూపాయల ధర పలికింది. 3 లక్షల 68 వేల 359 రూపాయలు రైతులకు ఆదాయం వచ్చింది. దీంతో పంట సాగు చేసిన రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది.

ఆయిల్ పామ్ లాభాదాయకమైన పంట..

బద్దం రాంరెడ్డి, నర్సింగాపూర్, ధర్మారం



ఆయిల్ పామ్ పంట లాభాదాయకమైంది. మూడున్నర ఎకరాల్లో పంట వేశాను. మొదట వేసిన ఎకరంన్నర పంట మూడేళ్ల తర్వాత కాపునకు వచ్చింది. రెండుసార్లు పంట కోశాను. ఒక టన్ను 40 కిలోల దిగుబడి వచ్చింది. ఏడాదిలో ఎనిమిదిసార్లు పంట కోతకు వస్తుంది. ప్రస్తుతం టన్నుకు 20 వేలకు పైగా ధర పలికింది. బాగా చేస్తే మంచి దిగుబడులు వస్తాయి. ఆయిల్ పామ్ మధ్యలో అంతర పంటలు కూడా వేసుకోవచ్చు. మా గ్రామంలో 70 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

నమ్మకం కుదిరింది..

జునేని శ్యామ్‌సుందర్ రావు, శివపల్లి, ఎలిగేడు



నేను రెండు ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేశా. ప్రస్తుతం 2 టన్నుల వరకు మొదటి దిగుబడి వచ్చింది. తద్వారా 40 వేల వరకు ఆదాయం వచ్చింది. ఆ పంట చెక్కును కలెక్టర్ ద్వారా తీసుకోవడం సంతోషాన్నిచ్చింది. ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలంటే మొదట భయపడ్డాం. అధికారులు ప్రోత్సహించడంతో పంట సాగు చేశాం. ప్రభుత్వం రాయితీ ఇచ్చింది. ఉద్యాన శాఖాధికారుల సూచనల మేరకు పంట సాగు చేశాం. దిగుబడి వచ్చిన తర్వాత సాగుపై నమ్మకం కుదిరింది.

జిల్లాలో 3,100 ఎకరాల్లో పంట సాగు..

జగన్మోహన్ రావు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి, పెద్దపల్లి



జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై మూడేళ్లుగా రైతులను ప్రోత్సహిస్తున్నాం. మూడేళ్లలో జిల్లాకు 2,500 ఎకరాల్లో టార్గెట్ ఇవ్వగా, వ్యవసాయ శాఖ అధికారులను సమన్వయం చేసుకుని 3,100 ఎకరాలకు పెంచాం. ముందు ప్రయోగాత్మకంగా 11.23 ఎకరాల్లో సాగు చేసిన పంట ప్రస్తుతం కోతకు వచ్చింది. ఇప్పటి వరకు రెండు కోతల్లో 18.357 టన్నుల దిగుబడి వచ్చింది. దీంతో రైతులకు ఆయిల్ పామ్ పంట సాగుపై నమ్మకం కుదిరింది.

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

గణేశ్‌నగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ పరీక్షలు, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ మంతెన రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 25 నుంచి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. 150 రోజులపాటు నిర్వహించనున్న శిక్షణలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 1000 స్టైఫండ్ అందజేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా నిరుద్యోగులు ఈ నెల 16 నుంచి వచ్చే నెల 11 వరకు www. tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 0878- 2268686 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేడు కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ముఖ్యనాయకులతో సమావేశాలు

కరీంనగర్ అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ బుధవారం కరీంనగర్‌కు రానున్నారు. డీసీసీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఉమ్మడి జిల్లాలోని నాలుగు జిల్లాలవారీగా ముఖ్యనాయకులతో సమావేశాలు నిర్వహించనున్నారు. జిల్లా మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్, శాసనసమండలి అభ్యర్థులు, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలు, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌లు, గ్రంథాలయ, సుడా చైర్మన్, టీపీసీసీ సమన్వయకర్తలతో సమీక్షించనున్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జూలై 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు


మావోయిస్టు దంపతుల వివరాలు వెల్లడిస్తున్న రామగుండం పోలీసు కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా

లొంగిపోయిన మావోయిస్టులకు రూ.25లక్షల రివార్డు అందజేత

గోదావరిఖని/మంచిర్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సీపీఐ(మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, టెక్నికల్ టీమ్ ఇన్‌చార్జి ఆత్రం లచ్చన్న అలియాస్ గోపన్న(70), అతని భార్య చౌదరి అంకూ బాయి అలియాస్ అనితక్క(55) మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఎదుట లొంగిపోయారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారుపల్లి గ్రామానికి చెందిన ఆత్రం లచ్చన్న ప్రస్తుతం దండకారణ్యంలో పని చేస్తున్నారు. 1983లో చెన్నూరు దళంలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన లచ్చన్న సిర్పూర్ దళంలో డిప్యూటీ కమాండర్‌గా పనిచేశాడు.

2002లో దండకారణ్యంలోకి వెళ్లి పోయాడు. అప్పటి నుంచి దండకారణ్యంలో నార్త్ బస్తర్ డివిజన్ కమిటీకి టెక్నికల్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. ఆయుధాల తయారీలో సిద్ధహస్తుడిగా పేరుంది. ఆయన భార్య చౌదరి అంకూబాయి కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం అగరగూడ గ్రామానికి చెందిన వారు. 1988లో పీపుల్స్‌వార్‌లో చేరిన ఆమె సిర్పూర్ దళంలో పని చేస్తూ ఆత్రం లచ్చన్నను పెళ్లి చేసుకుంది. ఇద్దరూ దండకారణ్యంలో టెక్నికల్ విభాగంలో పని చేశారు. పార్టీకి ఆదరణ లేకపోవడం, అనారోగ్యంతో లొంగిపోతున్నట్టు మావోయిస్టు దంపతులు లచ్చన్న, అంకూబాయిలు పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ(రాష్ట్ర కమిటీ) సభ్యుడు ఆత్రం లచ్చన్నకు రూ.20 లక్షలు, అతని భార్య నార్త్ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యురాలు చౌదరి అంకుబాయికి రూ.5లక్షల రివార్డులను సీపీ అంబర్ కిశోర్‌ఝా అందజేశారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మావోయిస్టులకు ప్రజల్లో ఆదరణ లేదని, అజ్ఞాతం వీడి జన జీవన స్రవంతిలోకి రావాలని, వారికి తెలంగాణ ప్రభుత్వ పరంగా పునరావాస పథకాలు, ఇతర సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. విలేకరుల సమావేశంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సీ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్‌బీ ఏసీపీ మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలున్న పిల్లలనూ దత్తతకు తీసుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- దత్తత కోరిన యూఎస్‌ఏ దంపతులతో ముఖాముఖి

కరీంనగర్ క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి):విదేశాల నుంచి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను దత్తత తీసుకునేందుకు ముందుకు వస్తున్నారని, ఇక్కడి వారు సైతం ఈ పిల్లలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అమెరికా నుంచి దంపతులు ఐదేళ్లలోపు చిన్నారిని దత్తత తీసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. దత్తత ప్రక్రియలో భాగంగా కలెక్టర్ వారితో మంగళవారం వెబినార్‌లో ముఖాముఖి నిర్వహించారు. కుటుంబ నేపథ్యం, వృత్తి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలసదనం నుంచి యూఎస్ఏ దంపతులకు దత్తత ఇవ్వనున్న ప్రత్యేక అవసరాలు ఉన్న ఐదేళ్ల చిన్నారిని చూపించారు. ఈ దత్తతకు సంబంధించి నివేదికను దౌత్య కార్యాలయానికి పంపనున్నారు.

దత్తత ఉత్తర్వులు అందజేత..

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్, హైదరాబాద్, తమిళనాడుకు చెందిన దంపతులు కరీంనగర్ శిశుగృహ నుంచి పిల్లలను గతంలో దత్తత తీసుకున్నారు. ఈ దంపతులకు కలెక్టర్ మంగళవారం దత్తత ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీసీపీవో పర్వీన్, పీవో ఎస్ఐసీ తిరుపతి,శిశుగృహ మేనేజర్ తేజస్వి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల వెనుక పెద్ద కుట్ర

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్


సిరిసిల్లలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

సిరిసిల్ల జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, ప్రభుత్వం వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మోదీ గిఫ్ట్ పేరుతో 10వ తరగతి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో సంజయ్ మాట్లాడుతూ వైఎస్ హయాంలో ముస్లింలను బీసీల్లో చేర్చి 4 శాతం రిజర్వేషన్లను అమలు చేసిందని, ఆ సమయంలోనే బీసీ సంఘాలు అడ్డుకుని ఉంటే బీసీలకు అన్యాయం జరుగకుండా ఉండేదని అన్నారు. ఇప్పుడు 10 శాతం ఇస్తామనడం దారుణమని అన్నారు.

వాస్తవానికి బీసీ జనాభా రాష్ట్రంలో 51 శాతం ఉందని సమగ్ర కుటుంబ సర్వేలోనే ఈ విషయాన్ని తేల్చారన్నారు.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పేరుతో బీసీల జనాభాను 46 శాతానికి తగ్గించారన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెబుతూ అందులో 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు అమలు చేస్తున్నారన్నారు. ముస్లింలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలవుతున్నాయన్నారు. బీసీ రిజర్వేషన్ల జాబితా నుంచి ముస్లింలను తొలగించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని అన్నారు. బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగకుండా సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడేపు రవీందర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్,సభ్యుడు మ్యాన రాంప్రసాద్, పట్టణాధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉత్తమ సహకార బ్యాంకుగా కేడీసీసీబీ

కరీంనగర్ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేడీసీసీబీని దేశంలోనే ఉత్తమ సహకార బ్యాంకుగా నాబార్డు అవార్డుకు ఎంపిక చేసింది. మంగళవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేతులమీదుగా బ్యాంకు చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సీఈవో సత్యనారాయణరావు అవార్డును అందుకున్నారు.

చొప్పదండి సహకార సంఘానికి బెస్ట్ పెర్ఫార్మింగ్ అవార్డు

చొప్పదండి: చొప్పదండి ప్రాథమిక సహకార సంఘానికి బెస్ట్ పెర్ఫార్మింగ్ అవార్డును అందజేశారు. నాబార్డు 44వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అవార్డును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్యాక్స్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, వైస్ చైర్మన్ ముద్దం మల్లేశం, సీఈవో కళ్లెం తిరుపతిరెడ్డిలకు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు సమక్షంలో అందజేశారు. అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, సంఘ పాలకవర్గం సమష్టి కృషి, సభ్యుల సహకారంతో అవార్డు దక్కిందని చైర్మన్ వెల్మ మల్లారెడ్డి అన్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నుంచి అవార్డు అందుకుంటున్న బ్యాంకు చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, చొప్పదండి సహకార సంఘం చైర్మన్ వెల్మ మల్లారెడ్డి

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు

ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు


డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న రీజినల్ మేనేజర్ బి.రాజు

భగత్‌నగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థలో ప్రమాదాలు మానవ తప్పిదాలతోనే సంభవిస్తుంటాయని రీజినల్ మేనేజర్ బి.రాజు అన్నారు. మంగళవారం కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోలకు చెందిన 51 మంది డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఎక్కువ సంఖ్యలో మరణాలకు గురవుతుంటారన్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఏకాగ్రత పాటించాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, ప్రయాణికులను సరక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని అన్నారు. దీంతో ఆర్టీసీకి ప్రజల్లో మరింత ఆదరణ లభిస్తుందన్నారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లు ఎస్. భూపతిరెడ్డి, మామిడాల శ్రీనివాస్, సేఫ్టీ వార్డెన్స్ గోపాల్, టి. కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఫారెస్ట్ సెక్షన్ అధికారులు రంజిత్‌కుమార్, సక్కారం

వీర్నపల్లి, జూలై 15, (ఆంధ్రజ్యోతి): మారుమూల అటవీ పల్లెలు, తండాల్లో నివసించే ప్రజలు పొలాల వద్దకు, పశువుల మేతకు తీసుకువెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ సెక్షన్ అధికారులు సూచించారు. వీర్నపల్లి మండలం మదిమల్ల, మద్దిమల్ల తండా, బాబాయ్ చెర్వు తండా, రాశిగుట్ట తండా, పరిసర అటవీ ప్రాంతాల్లో ఎఫ్ఎస్‌వోలు రంజిత్‌కుమార్, సక్కారం మంగళవారం అవగాహన కల్పించారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. రైతులు పొలాల వద్దకు గుంపులుగా వెళ్లాలన్నారు. అడవిలోకి పశువులను మేతకు తీసుకెళ్లద్దన్నారు. అడవిలో పులి సంచరించినట్లు అనుమానం వస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

ఆర్టీసీ కండక్టర్ల వెతలు



- అదనపు విధులతో ఇబ్బందులు
- బస్సులకు కండక్టర్ల కొరత

కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా కండక్టర్ల సంఖ్య	
గోదావరిఖని	186
హుస్నాబాద్	108
హుజూరాబాద్	97
జగిత్యాల	157
కరీంనగర్-1	172
కరీంనగర్-2	224
కోరుట్ల	88
మంథని	79
మెట్‌పల్లి	88
సిరిసిల్ల	114
వేములవాడ	96
రీజియన్‌లో	12
	1421

భగత్‌నగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)లో కండక్టర్లు వెతలు అన్నీఇన్నీకావు. మహా లక్ష్మి పథకం అమలుతో బస్సుల్లో రద్దీ తీవ్రత ఎక్కువైంది. ఈ పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న కండక్టర్లు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. మరోవైపు కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 డిపోలు ఉండగా బస్సులకు సరిపడా కండక్టర్లు లేరు. అదనపు విధులతో ఇబ్బందులు పడుతున్నారు.

కరీంనగర్ రీజియన్‌లో కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, మంథని, గోదావరిఖని, హుజూరాబాద్, హుస్నాబాద్ డిపోలు ఉన్నాయి. రీజియన్ వ్యాప్తంగా సుమారు 912 బస్సులకు 1421 మంది కండక్టర్లు మాత్రమే ఉన్నారు. దశాబ్ద కాలంగా ఆర్టీసీలో నూతన నియమకాలు చేపట్టక పోవడంతో రీజియన్ వ్యాప్తంగా అన్ని విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. ఇటీవల డ్రైవర్లను నియమించారు. కండక్టర్లు, ఇతర విభాగాల్లో ఆర్టీసీ నియామకాలు చేపట్టలేదు.

ఒక్కో బస్సుకు ముగ్గురు కండక్టర్ల అవసరం

సాధారంగా ఒక బస్సుకు ముగ్గురు చొప్పున కండక్టర్లు అవసరం. ఇద్దరు కండక్టర్లు కూడా లేక పోవడం గమనార్హం. దీంతో కండక్టర్లు ఎక్కువ గంటలు పని చేయాల్సిరావడంతో ఒత్తిడికి లోనవుతున్నారు. ఆరోగ్య పరిస్థితి దెబ్బతింటున్నదని కండక్టర్లు వాపోతున్నారు.

కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా కండక్టర్ల కొరతతో రద్దీ రూట్లలో సైతం బస్సులను పూర్తి స్థాయిలో తిప్పలేక పోతున్నారు. దీంతో ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా అనేక రూట్లలో బస్సులు రద్దయ్యే పరస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సంస్థ ఉన్నతాధికారులు కండక్టర్ల కొరతను తీర్చేందుకు ఏర్పాట్లు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'స్వశక్తి'కి ప్రోత్సాహం

(5వ పేజీ తరువాయి)

రూ.17.03 కోట్లు, కాంగ్రెస్ ప్రభుత్వంలో 2023-2024లో రూ. 7,802 సంఘాలకు రూ. 7.39కోట్లు, 2024-2025లో రూ. 8,552 సంఘాలకు రూ. 11.77 కోట్లు రాయితీ అందుకున్నారు.

● పాత బకాయిలు రూ. 68.66 కోట్లు

మహిళలు స్వశక్తితో ఎదగడానికి ఆర్థికాభివృద్ధికి పొదుపు సంఘాలు బాటలు వేసినా ప్రభుత్వం నుంచి రావాల్సిన వడ్డీ రాయితీ సకాలంలో రాకపోవడంతో ప్రయోజనం అందడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం పాత బకాయిల జోలికి వెళ్లకపోవడంతో నిరీక్షణ తప్పదా అని మహిళ సంఘాలు భావిస్తున్నాయి. జిల్లాలో 2020-21 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన వడ్డీ రాయితీ బకాయిలు రూ. 68.66 కోట్లకు చేరుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 9,963 స్వశక్తి సంఘాలు, 411 గ్రామసంఘాలు, 12మండల సంఘాలు, వీటికి అను సంధానం చేస్తూ జిల్లా సమాఖ్య కూడా పనిచేస్తుంది. స్వశక్తి సంఘాల పరిధిలో దాదాపు 1,12,637మంది సభ్యులు ఉన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ వీరికి ప్రతి సంవత్సరం కోట్లలోనే వడ్డీలేని రుణాలను అందిస్తోంది. స్వశక్తి సంఘాలకు బ్యాంక్ లింకేజీ అందించడంలో ఇబ్బందులు లేకపోయినా వడ్డీ రాయితీ మాత్రమే భారంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో 9,755 స్వశక్తి సంఘాలకు రూ.68.66 కోట్లు వడ్డీ రాయితీ రావాల్సి ఉంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 9051 సంఘాలకు రూ. 20.67 కోట్లు రాయితీ రావాల్సి ఉండగా 2021-22లో 9001 సంఘాలకు రూ.25.78 కోట్లు, 2022-23 సంవత్సరంలో 9,755 సంఘాలకు రూ.22.21కోట్లు రావాల్సి ఉంది.

పార్టీలకతీతంగా ఆరోగ్యానికి ప్రాధాన్యం



ఎల్‌ఓసీ అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ పార్టీలకు అతీతంగా ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని, పేదలకు ఆసరాగా సీఎం సహాయ నిధి ఉంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం ఎగ్లాస్పూర్ గ్రామానికి చెందిన మాజీ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ భర్త దండు ఐలయ్యకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషాతో కలిసి సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. లబ్ధిదారుడు దండు ఐలయ్య ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పసుల పోచయ్య, బోయిని దేవరాజు, సతీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

ఇల్లంతకుంట, జూలై 15(ఆంధ్రజ్యోతి) : రైతులు తమ ఉత్పత్తులు పెంచడానికి సహకార సంఘానికి రుణం అందించారు. హైద్రాబాద్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో మంగళవారం సమావేశం జరిగింది. జిల్లాలోని ఆరు సహకార సంఘాలు ఎఫ్‌పీఓ సంఘాలుగా ఎంపికయ్యాయి. వీటికి తొలివిడుతగా రూ 3.16లక్షల రుణం అందించారు. ఈ రుణంతో పాటు సహకార సంఘం మరిన్ని నిధులు కేటాయించి రైతులు వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులు పెంచాలని సూచించారు. ఇల్లంతకుంట ప్యాక్స్‌చైర్మన్ గొడుగు తిరుపతి, సీఈఓ చిట్టి రవీందర్‌రెడ్డి హాజరయ్యారు.

రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ అండ్ కరాటే పోటీలు

సిరిసిల్ల టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : షావలిన్ కుంగ్‌ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7న కరీంనగర్‌లో నిర్వహించనున్న మూడవ రాష్ట్ర స్థాయి కుంఫూ అండ్ కరాటే చాపింయన్ షిప్ పోటీలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కుంఫూ యూనిట్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీధర్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో ఆల్‌స్టైల్ మార్షల్ ఆర్ట్స్ జిల్లా కార్యనిర్వాహకుడు ఎనగందుల శ్రీనివాస్, మార్షల్ ఆర్ట్స్ సీనియర్ మాస్టర్స్ ఓరగంటి రామకృష్ణ, నాగల కనకయ్య, మామిడాల సమ్మయ్య, ఎండీ సమీనా, గగ్గూరి దివ్య పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్ ఘటనపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడవద్దని ముదిగొండ ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నాయకులు ముద్దం అనిల్‌గౌడ్, వడ్లూరి సాయి సూర్య, ఎస్‌కే అఫ్రోజ్, కాసర్ల శ్రీనివాస్, నక్క జోహెల్, అక్రమ్ పాల్గొన్నారు.

బోరు తవ్వకం పనులు ప్రారంభం

వీర్నపల్లి, జూలై15,(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో తాగునీటి ఇబ్బందులను తొలగించడానికి ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిధుల ద్వారా బోరు తవ్వకం మండల అధ్యక్షులు మాలోతు లక్పతి నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. మండల ప్రధాన కార్యదర్శులు పిట్ల నాగరాజు, బట్టు పీర్యా, బీజేవైఎం మాజీ అధ్యక్షులు బండారి మహేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీర్నపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో బదిలీ

వీర్నపల్లి, జూలై15,(ఆంధ్రజ్యోతి):వీర్నపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎంపీవో అబ్దుల్ వాజీద్ ముస్తాబాద్ ఎంపీవోగా బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న ఇంచార్జి ఎంపీడీవో బీరయ్యను వీర్నపల్లి పూర్తిస్థాయి ఎంపిడీవోగా అధికారులు నియమించారు. బీరయ్య బుధవారం బాధ్యతలను స్వీకరించనున్నారు.

ముస్తాబాద్ ఎంపీడీవోగా లచ్చాలు

ముస్తాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల పరిషత్ అధికారిగా పుట్ట లచ్చాలు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌లో ఎంపీడీవోగా పనిచేసిన లచ్చాలును ముస్తాబాద్‌కు బదిలీ చేయగా ముస్తాబాద్‌లో పనిచేసిన ఇంచార్జ్ ఎంపీడీవో బీరయ్యను వీర్నపెల్లి మండల ఎంపీడీవోగా బదిలీ చేశారు.

ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బోనాలు

ఇల్లంతకుంట, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో బోనాల పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి మాట్లాడుతు ఆషాడ మాసంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో వర్షాలు సమృద్ధిగా కురియాలని బోణాలు తీయడం ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. గ్రామదేవతలకు బోణాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనువోజు రాజు, లక్ష్మిలతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు : తప్పిన ప్రమాదం

రుద్రంగి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ సమీపంలో ఓ కారు అదుపుతప్పి రోడ్డుపై నుంచి పంట చేనులోకి దూసుకుపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి నుంచి కథలాపూర్ వైపు వెళ్తున్న కారుకు గేదె అడ్డురావడంతో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు కిందికి పంట చేనులోకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు.

స్నేహితుల భరోసా

- మృతురాలి కూతురు పేరిట రూ.40 వేల డిపాజిట్

ఎల్లారెడ్డిపేట, జూలై15(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తోటి స్నేహితురాలు నిర్మల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. తల్లి చనిపోవడంతో ఇద్దరి పిల్లలు పరిస్థితి దీనంగా మారింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006-2007 పదో తరగతి స్నేహితులు కలిసి నిర్మల పిల్లలను ఆదుకునేందుకు మంగళవారం ముందుకు వచ్చారు. మిత్రులు పోగు చేసిన రూ.40 వేల నగదును నిర్మల కూతురు సాన్విక పేరిట డిపాజిట్ చేసి పత్రాలను అందజేశారు. మృతి చెందిన స్నేహితురాలి కుటుంబానికి బాసటగా నిలుస్తామని తోటి మిత్రులు భరోసా కల్పించారు. కార్యక్రమంలో స్నేహితులు పృథ్వీధర్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రశాంత్, కృష్ణారెడ్డి, ఇంతియాజ్, వెంకటేశ్, స్థానికులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపివేయాలి



మాట్లాడుతున్న పర్కాల రవీందర్

సిరిసిల్ల రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు అశాస్త్రీయం, అసంబద్ధంగా ఉందని దీనిని వెంటనే నిలిపివేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఏమాత్రం నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా సర్దుబాటు చేపట్టారన్నారు. కోనరావుపేట మండలంలోని ఒక ప్రాథమిక పాఠశాలలో 118 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని టెక్నికల్ ప్రాబ్లెమ్స్ వల్ల అందరూ విద్యార్థులవి ఆన్‌లైన్ కాకపోవడంతో నిబంధలన ప్రకారం ఒక ఉపాధ్యాయుడిని మాత్రమే తీయాల్సి ఉందని కానీ అక్కడి ఇద్దరు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం వల్ల 118 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఏ విధంగా బోధన చేస్తారని ప్రశ్నించారు. అదే విధంగా మరో పాఠశాలలో 11మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నారని ఉన్న ఒక ఉపాధ్యాయుడిని సర్దుబాటులో భాగంగా వేరే పాఠశాలకు కేటాయించడం వల్ల అక్కడి 11 మంది విద్యార్థులకు బోధన చేసే వారే లేకుండా పోయారని అన్నారు. ఒక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు సరిపడా విద్యార్థులు ఉన్నప్పటికీ ఆ పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని వేరే పాఠశాలకు కేటాయించి, వేరే పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని మళ్లీ అదే పాఠశాలకు కేటాయించడం దారుణమన్నారు. సర్దుబాటులో చాలా పాఠశాలలకు అన్యాయం జరిగిందన్నారు. ఇందులోని పొరపాట్లను సవరించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, గన్నమనేని మహేందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ పద్ధతిలో చేపట్టాలి : టీపీటీఎఫ్

సిరిసిల్ల రూరల్ : రాజన్న సిరిసిల్ల జిల్లాలో చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపివేసి కౌన్సెలింగ్ పద్ధతిలో చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుమాల రామ్‌నాథ్‌రెడ్డి, విక్కుర్తి అంజయ్యలు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం బడిబాట తర్వాత పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉన్నా ప్రస్తుత సంఖ్యను పరిగణంలోకి తీసుకోకుండా పూర్వపు విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం జరిగిందన్నారు. నిబంధన ప్రకారం కాంప్లెక్స్ యూనిట్ మొదట ఆ తర్వాత మండల యూనిట్‌గా, జిల్లా యూనిట్‌గా తీసుకోవాల్సి ఉండగా మండలంకు సంబంధించి ఉపాధ్యాయులను దూరం మండలంకు సర్దుబాటు చేయడం జరిగిందన్నారు. బావుసాయిపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిని సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట పాఠశాలకు కేటాయించారన్నారు. వెంకంపేటలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని రుద్రంగి మండలం మానాల పాఠశాలకు కేటాయించారన్నారు. డిప్యూటేషన్ ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధంగా ఇవ్వడం జరిగిందన్నారు. అసంబద్ధంగా ఉన్న సర్దుబాటును నిలిపివేసి కౌన్సెలింగ్ పద్ధతిన చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

గొర్రెల షెడ్ల నిర్మాణం కోసం స్థలం కేటాయించాలి

బోయినపల్లి జూలై 15 (ఆంధ్రజ్యోతి) :గొర్రెల షెడ్ల నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని మిడ్ మానేరు ముంపు గ్రామమైన కొదురుపాక గొర్రెల కాపరులు మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం అందజేశారు. పునరావాస కాలనీలోని భూమి కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్ నాయకులు నాగల వంశీ శాలివాన శ్రీనివాస్ యాదవ సంఘం నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ వికలాంగులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

కోనరావుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వికలాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చారని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి కోరారు. వికలాంగులకు 6 వేలు, వృద్ధాప్య పెన్షన్లు 4 వేలు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. అందుకే ఈ నెల 27న జిల్లా కేంద్రంలో మహాసభను నిర్వహిస్తున్నామని అన్నారు.

టీచర్ల డిప్యుటేషన్ రద్దు చేయండి

- కలెక్టర్‌కు తల్లిదండ్రుల వేడుకోలు

కోనరావుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి ప్రాథమిక పాఠశాల (ఎస్టీకాలనీ)లో ఉపాధ్యాయుల డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారిని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టీకాలనీ పాఠశాలలో 23 మంది విద్యార్థులున్నారని ఇందులో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు డిప్యుటేషన్‌పై మరో పాఠశాలకు పంపించారని అన్నారు. దీంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని వాపోయారు. పాఠశాల అభివృద్ధి కోసం ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించామని, ఇప్పుడు ఉపాధ్యాయులను వేరే పాఠశాలకు పంపిస్తే ఎలా అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బెంద్రపు జ్యోతి, సభ్యులు లత, నవ్య, అంజవ్వ, భార్గవి, లత తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు సరికాదు



సమస్యలు తెలుసుకుంటున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు చూస్తేంటే కక్షసాధింపును తలపిస్తున్నట్లు ఉందని, ఇది సరికాదని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్‌లో రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన భవన యజమానులను మంగళవారం కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాధితులు తమ సమస్యలను చల్మెడ దృష్టికి తీసుకువెళ్లారు. విస్తరణలో భవనాలు కోల్పోతున్న నిర్వాసితులు సాక్షాత్తు స్థానిక ఎమ్మెల్యే వద్దకు వెళ్లి తమకు గడువు ఇవ్వాలని కోరినా ఇవ్వలేదని ఈ సందర్భంగా చల్మెడ గుర్తు చేశారు. పరిహారం అవ్వకుండా కనీస సమయం ఇవ్వకుండా ఆగమేఘాల మీద భవనాలను, దుకాణాలను కూల్చివేశారని అన్నారు. అభివృద్ధిని అడ్డుకోవడం లేదని, రోడ్డు విస్తరణలో భాగంగా తమ ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు సరైన పరిహారం అందించాలన్నారు. అర్ధరాత్రి యంత్రాలతో కూల్చడం సరైంది కాదని అన్నారు. తిప్పాపూర్‌లో గజానికి రూ. 8500 పరిహారం ఇస్తామని నోటీసులు ఇచ్చారని, ఆ ధర సరైనదేనా.. చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామతీర్థపు రాజు, గొస్కుల రవి, శ్రీకాంత్‌గౌడ్, ముత్త మహేష్, గుడిసే సదానందం, జోగిని శంకర్, సిరిగిరి రామచంద్రం, గోలి మహేష్ తదితరులు ఉన్నారు.

బీసీ మహాధర్నాకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మహాధర్నాకు సిరిసిల్ల పట్టణ బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో మహాధర్నాకు సిరిసిల్ల పట్టణ నుంచి బీఆర్ఎస్, బీఆర్ఎస్ యువజన, బీఆర్ఎస్వీ నాయకులు వాహనాలపై పెద్ద సంఖ్యలో వెళ్లారు. మహాధర్నాకు వెళ్లిన వారిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడగట్ల మురళి ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట : కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో చట్టబద్ధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన బీసీల మహాధర్నాకు ఎల్లారెడ్డిపేట మండలంలోని గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. మండల కేంద్రంలోని ప్రదర్శన నిర్వహించిన ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు రమేశ్, సుభాష్, దేవరాజు, భీమేశ్వర్, జబ్బార్, స్వామి, శివరామకృష్ణ, శ్రీనివాస్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

మానాల సొదీ సంఘం కార్యవర్గం

రుద్రంగి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలం మానాల గ్రామంలో మానాల సొదీ సంఘాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిక్క భూమయ్య, ఉపాధ్యక్షుడిగా చెదల్ నవీన్, క్యాషియర్‌గా దాసరి ఆశోక్‌లను ఎన్నుకున్నారు.

సూరమ్మ ప్రాజెక్టు పనుల పరిశీలన

రుద్రంగి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రం శివారులోని కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు నిర్మాణ పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తూమ్ పనులను పూర్తి చేసి నీరు వృధాగా పోకుండా చూడాలన్నారు. కట్ట పనులను శరవేగంగా నాణ్యతతో చేపట్టాలని చూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

సిరిసిల్ల రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని కాకతీయ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు దంత పరీక్షలు చేపట్టారు. విద్యార్థులందరికీ డాక్టర్ నిఖిత పళ్ల పరీక్షలు చేపట్టారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగుమీడియం పాఠశాలలో చదువుకుని డెంటల్ డాక్టర్‌గా ఎదిగిన నిఖితను పాఠశాల కరస్పాండెంట్ గుగ్గిళ్ల జగన్ గౌడ్, డైరెక్టర్ గుగ్గిళ్ల శైలజ అభినందించారు.

ఓ వైపు నాటడం.. మరో వైపు నరకడం

● విద్యుత్ సరఫరాకు ఆటంకం ● హరితహారం మొక్కల నరికివేత



మూడపెల్లిలో నరికిన హరితహారం చెట్లు

చందుర్తి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా ప్రభుత్వాలు మొక్కలు నాటుతున్నాయి. రోడ్డు పక్కన మొక్కలు నాటడంతో అవి పెరిగి విద్యుత్ తీగలకు తాకుతుంటాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటాయని విద్యుత్ శాఖ అధికారులు ఏటా వర్షాకాలం ఆరంభంలో వాటి కొమ్మలు నరికివేస్తున్నారు. ఫలితంగా చెట్టు ఎదిగే అవకాశమే ఉండదు. ఏటా ఎదురయ్యే ఈ సమస్య పరిష్కారంపై ప్రభుత్వ శాఖల అధికారులు దృష్టి సారించాలి. పదుల రూపాయల విలువైన మొక్కను వందల రూపాయల వ్యయంతో నాటి, సంరక్షిస్తే. వేలాది రూపాయలు వెచ్చించి ఏటా నరికించడం తంతుగా మారింది. తద్వారా ప్రజాధనం దుర్వినియోగం కావడమే కాకుండా హరితహారం లక్ష్యం నీరుగారుతోంది. చందుర్తి మండల కేంద్రంతో పాటు మల్యాల, మర్రిగడ్డ, మూఢపల్లి గ్రామాల్లోని వేములవాడ- కోరుట్ల ప్రధాన రహదారుల వెంబడి గతంలో మొక్కలు విస్తృతంగా నాటించారు. వాటిలో కొన్ని ఏపుగా పెరగటంతో ప్రస్తుతం ఈదురు గాలులతో విద్యుత్ తీగలకు కొమ్మలు తగులుతున్నాయని వాటిని నరికివేస్తున్నారు.

లక్ష్యానికి విఘాతం

పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు మండల వ్యాప్తంగా విస్తృత ప్రాధాన్యం ఇస్తున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి మొక్కలు నాటుతున్న సమయంలో విద్యుత్తు స్తంభాలు ఉన్న వైపు తీగల కింద భాగంలో నాటుతున్నారు. ట్యాంకర్లతో నీటిని పోసి వాటిని పెంచుతున్నారు. తీగలకు తాకి విద్యుత్ అంతరాయం ఉంటోందని నరికివేస్తున్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు



మాట్లాడుతున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రకాష్

సిరిసిల్ల టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పార్టీలతో సంబంధం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వంలో పారదర్శకంగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా మీరు నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అవకతవకలు, అవినీతి జరిగిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు అడ్డదారుల్లో అనర్హులకు ఇళ్లు ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు వేసి నిజమైన పేదవారిని గుర్తించి వారి పేర్లను ప్రభుత్వానికి ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వ అధికారులు ఆ పేర్లను పరిశీలించి విచారణ జరిపిన తరువాత అర్హులైతేనే వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మా ఊరు - మా బడి అభివృద్ధి పనులకు మూడు సంవత్సరాలుగా బిల్లులు రావడం లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంను నిందించడం సరికాదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కూడా ఇసుకకు రూ. 1500ల కంటే ఎక్కువ డబ్బులు ఇవ్వవద్దని ట్రాక్టర్ యజమానులు ఎక్కువ డబ్బులు డిమాండ్ చేస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పీసీసీ మాజీ కార్య దర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మినారాయణ, ఆడెపు చంద్రకళ, రెడ్యానాయక్, కత్తెర దేవదాస్, ఆడెపు ప్రభాకర్, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు భీమవరపు శ్రీనివాస్, వైద్య శివప్రసాద్, చెన్నమనేని కమలాకర్‌రావు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: సంక్షేమం పేరుతో బీఆర్ఎస్ నాయకులు సకలం దోచుకున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ ఆరోపించారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఫ్రెండ్స్ క్లబ్‌లో జిల్లెల్ల డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్ ఉన్న కేటీఆర్ సన్యాసం తీసుకుని రాష్ట్రాలు తిరుగుతున్నాడని విమర్శించారు. ఓడిపోయినా ప్రజల మధ్యనే ఉంటున్న వ్యక్తి కేకే మహేందర్‌రెడ్డి అని అన్నారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లడడాన్ని తప్పుపట్టారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకు లు నేరెళ్ల నర్సింగంగౌడ్, లింగాల భూపతి, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్. ఆసరి బాల్‌రాజు, ఇట్టిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పొన్నాల పర్శరాములు, మోర లక్ష్మిరాజం, మీరాల శ్రీనివాస్ యాదవ్, బాలసాని నర్సయ్య, మునిగేల రాజు, గుగ్గిళ్ల భరత్‌గౌడ్, ఎగుర్ల ప్రశాంత్. జిల్లెల్ల డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట కాంగ్రెస్‌పార్టీపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు.

ఎల్లారెడ్డిపేట: గత బీఆర్ఎస్ హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడి కేసుల్లో చిక్కుకుని ప్రస్తుతం బెయిల్‌పై బయట తిరిగే ఆ పార్టీ జిల్లా స్థాయి నాయకులు ఇసుక దోపిడీ గురించి మాట్లాడడం సిగ్గుచేటని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. నేరెళ్ల ఘటనను ప్రజలు ఎలా మర్చిపోతారని ప్రశ్నించారు. సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న కేకే మహేందర్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, రాజేందర్, గౌస్, శ్రీనివాస్, బుచ్చాగౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని శ్రీ వాసవి మాత ఆలయంలో మంగళవారం ఆషాఢ గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. చేతులను అందంగా తీర్చిదిద్దారు. ఆలయంలో అర్చకులు ఉదయం కుంకుమ పూజలను జరిపించారు. భక్తిశ్రద్ధల మధ్య అమ్మవారిని కొలిచారు. దేవీని శాకాంబరీ అవతారంలో అలంకరించారు. అమ్మవారు భక్తులకు శాకాంబరీ రూపంలో దర్శనమిచ్చారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కకాశీ కాలనీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేందర్, నాయకులు లక్ష్మారెడ్డి, సతీష్, అంజయ్య, శ్రీనివాస్, మధు, మనోజ్, ఎల్లం, గౌస్, రవి, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్‌గా వి అయిలయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అయిలయ్యను అధ్యాపక బృందం సుంచు రాజు, మురళి, గంగల్ల నర్సింలు తదితరులు శాలువాతో సత్కరించి అభినందించారు.

చందుర్తి: ఉన్న ఊరిలో ఉపాధి కరువై గల్ఫ్ వెళ్లి అక్కడ అప్పుల బాధతో గత నెల 11న ఆత్మహత్యకు పాల్పడిన చందుర్తి మండల కేంద్రానికి చెందిన కత్తి గణేష్ (24) అనే యువకుడి మృతదేహం మంగళవారం స్వగ్రామం చేరుకుంది. గణేష్ తల్లిదండ్రులు లక్ష్మి-మల్లేశం గతంలో ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందినారు. బంధువులు, స్నేహితులు, అంత్యక్రియలు నిర్వహించారు.

చందుర్తి: అంగన్‌వాడీ కేంద్రాలకు ఆరోగ్యలక్ష్మి ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ బుర్ర రేణుక అన్నారు. బండపల్లి గ్రామం రెండవ అంగన్వాడి కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి కమిటీ సమావేశంలో మంగళవారం మాట్లాడారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇతర తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిపై పంచాయతీ కార్యదర్శులతో జిల్లా, మండల అధికారులు సమీక్ష చేపట్టారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి, ఇసుకతో పాటు మట్టి తదితర అంశాలపై సమీక్ష జరిపి, పలు సూచనలు ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, మండల ప్రత్యేక అధికారి టి హనుమంతు, ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో సుదాకర్, మండలంలోని కార్యదర్శులు పాల్గొన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండలం కనగర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గోరింటాకు ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు చేతులపై గోరింటాకు పెట్టుకొని గోరింటాకు ఫెస్టివల్ జరుపుకున్నారు.